ఒనగూడునా..!


అచ్యుతాపురత్రయం గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్లు

- నూతన గృహాల మంజూరులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఏడాదిగా నిరుపేదల ఎదురుచూపులు
- దరఖాస్తు చేసినా స్పందించని అధికారులు
- నియోజకవర్గంలో నూతన దరఖాస్తులు 1,504
- గత ప్రభుత్వ హయాంలో 12,064 గృహ నిర్మాణాలకు మంజూరు
- అందులో 5,150 ఇళ్లు పూర్తి

పెదపూడి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ప్రతి గడపకూ వెళ్లి వలంటీర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, అర్హత ఉంటే చాలు, ఇళ్లు నిర్మించి ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ క్రమంలో ఏడాది కాలంగా ఒక్క ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని, దరఖాస్తు చేసుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పేద వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో నూతన గృహాల నిర్మాణ రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న పేదల వివరాలు ఇలా ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంలో..		వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..		
మండలం	దరఖాస్తులు	మంజూరైనవి	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్నవి
అనపర్తి	83	2,401	996	1,405
బిక్కవోలు	320	2,489	1,054	1,435
రంగంపేట	587	4,157	1,894	2,263
పెదపూడి	512	3,017	1,206	1,811
మొత్తం	1,502	12,064	5,150	6,914

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 12,064 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 5,150 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 6,914 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. మండలాల వారీగా ఈ వివరాలు ఇలా ఉన్నాయి.

మౌలిక సౌకర్యాల ఏర్పాటు

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లకు, ఆయా లేఅవుట్లకు రోడ్లు నిర్మించి, తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. వీటిలో పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు కూడా మంజూరయ్యాయి.

మా హయాంలో పేదలందరికీ ఇళ్లు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నూతన గృహాలను మంజూరు చేసి, నిర్మించి ఇచ్చాం. పేదలను ఇబ్బంది పెట్టకుండా బిల్లులు కూడా మంజూరయ్యాయి. రాజకీయాలు చూడకుండా, ఓటు వేశారా, లేదా అన్నది చూడకుండా, అన్ని వర్గాల ప్రజలకు గృహాలు మంజూరు చేసి, వారి కళ్లలో ఆనందం చూడాలన్నదే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయం. జగనన్న కాలనీల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులను ఎప్పటికప్పుడు కల్పించారు. అర్హులైన నిరుపేదలకు కూటమి ప్రభుత్వం నూతన గృహాలు మంజూరు చేసి, నిర్మించి ఇవ్వాలి.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కో–ఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ, అనపర్తి

అర్హులందరికీ మంజూరు చేయాలి



నూతన గృహాలను ప్రభుత్వం అర్హులందరికీ మంజూరు చేయాలి. కొత్త ఇళ్ల నిర్మాణం కోసం అనేక మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఆర్థిక స్తోమతను బట్టి లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుంటారు. నూతన గృహాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ లబ్ధిదారులు తిరుగుతున్నారు.

– సాంబత్తుల చంటి, నియోజకవర్గ కన్వీనర్, ఎస్సీ సెల్, వైఎస్సార్ సీపీ, కాండ్రేగుల గ్రామం, పెదపూడి మండలం

ప్రభుత్వ అనుమతులు రావాలి

పేదలు నూతన గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. నూతన గృహాల మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే అర్హులైన వారిని గుర్తించి, నూతన గృహాలు మంజూరు చేస్తాం. త్వరతగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సోమిరెడ్డి, హౌసింగ్ ఏఈ, పెదపూడి మండలం

క్లుప్తంగా

కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు


ప్రత్యేకాలంకరణలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం భారీ అభిషేకాలు నిర్వహించారు. ఆషాఢ మాసం ఆఖరి మంగళవారం ద్వాదశి కావడంతో భారీఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పెదపూడి: వివిధ అంశాలపై చర్చించేందుకు పెదపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి తెలిపారు. ఎంపీపీ కేతా తులసి సమావేశానికి అధ్యక్షత వహిస్తారన్నారు. వివిధ శాఖల అధికారులు మూడు నెలల అభివృద్ధి పనులను వివరిస్తారని చెప్పారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

26న ఉద్యోగ మేళా

అనపర్తి: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. అనపర్తి ఐఎల్‌టీడీ రోడ్డులోని సాయిమాధవి డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగే ఈ మేళాలో పదికి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. అలాగే 900 పైగా ఖాళీలున్నాయని తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లు ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99888 53335 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్ల కాపీలతో హాజరుకావాలని సూచించారు.

ఒనువులమ్మకు ఆషాఢం సారె


ఒనువులమ్మకు భక్తులు సమర్పించిన సారె

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని దివాన్‌చెరువు వద్ద కొలువైన గ్రామ దేవత ఒనువులమ్మకు భక్తులు మంగళవారం ఆషాఢ మాసం సారెను సమర్పించారు. పలు రకాల స్వీట్లతో పాటు, అరటి పండ్లు, యాపిల్స్, నిమ్మకాయలు తదితర వాటిని అమ్మవారికి చెల్లించారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలని వినతి

రంగంపేట: మండలంలోని సుభద్రంపేట గ్రామంలో తాండవిస్తున్న అపరిశుభ్రత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని గ్రామస్తులు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. డ్రైనేజీల్లో పూడికలు తీయకపోవడంతో మురుగు నీరు బయటకు పారక దోమలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దీని కారణంగా అనేక రోగాల పాలవుతున్నామన్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, దోమల నివారణ మందు కూడా పిచికారీ చేయడం లేదన్నారు. వీధుల్లో బ్లీచింగ్ కూడా చల్లడం లేదన్నారు. మూడు నెలలుగా గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదని, రాత్రి వేళల్లో చీకటి కారణంగా భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. వెంటనే వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు. ఆయా సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించినట్టు తెలిపారు.

ఈ-క్రాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సత్యప్రసాద్

పెదపూడి: రైతుల ధాన్యం కొనుగోలు చేయడానికి, పంట బీమా వర్తింపజేయడానికి ఉపయోగపడే ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ అన్నారు. పెదపూడిలో మంగళవారం ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ, మండలంలో 18,150 ఏకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. దానిలో 10,250 ఎకరాల్లో వరి వెదసాగు, వరినాట్లు విధానంలో సాగు పూర్తి చేశారన్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రానికి వెళ్లి రైతులు సాగు చేస్తున్న వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించి ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్ గౌడ్, ఏఈఓ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ జాతర

ముగిసిన ఉత్సవాలు


గ్రామ దేవత మోదకొండమ్మ

కోరుకొండ: మండలంలోని శ్రీరంగపట్నం గ్రామ దేవత మోదకొండమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం నుంచి నిర్వహించిన ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. శక్తి వేషధారణలు, దేవతలు, దేవుళ్లు, రాక్షసుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 15న బోనాలతో ప్రారంభమైన ఉత్సవాలు వారం రోజులు కొనసాగాయి. మంగళవారం జాతర, ఊరేగింపుతో ఉత్సవాలు ముగిశాయి. దాదాపు 150 ఏళ్లుగా ఉత్సవాలు జరుగుతున్నట్టు స్థానిక పెద్దలు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం నిప్పుల గుండంపై 40 కుటుంబాలకు చెందిన భక్తులు నడిచారు. అమ్మవారిని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. అన్న సమారాధన కోసం విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.1.50 లక్షల విలువైన 625 కేజీల బియ్యం, 600 కేజీల కోడిమాంసాన్ని సమకూర్చారు.


ఊరేగింపులో వివిధ వేషధారణల్లో కళాకారులు

ద్వారకానాథ్‌రెడ్డితో డాక్టర్ సూర్యనారాయణరెడ్డి భేటీ


రాజమహేంద్రవరంలో జక్కంపూడి రాజాను పరామర్శిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ద్వారకానాథ్‌ను కలసిన డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెదిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డితో అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం రాజమహేంద్రవరంలో భేటీ అయ్యారు. ఎంపీ మిథున్‌రెడ్డితో ములాఖత్ కోసం వచ్చిన ద్వారకానాథ్‌రెడ్డితో ఆయన పలు విషయాలపై మాట్లాడారు.

జక్కంపూడి రాజాకు పరామర్శ

పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన కోర్కెల సాధన కోసం పోరాడుతున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. రాజా ఆమరణ దీక్ష ప్రకటనతో కూటమి ప్రభుత్వం భయపడిందని, అందుకే అర్ధరాత్రి దీక్ష భగ్నం చేసి హౌస్ అరెస్టు చేశారని ఆరోపించారు. జక్కంపూడి రాజా పోరాటానికి సంఘీభావం తెలిపారు.

పీఎంపీలు పేర్లు నమోదు చేసుకోవాలి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకరరావు


డాక్టర్ మాధవరావును సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

అనపర్తి: గ్రామాల్లో ప్రాథమికంగా వైద్య సేవలందించే పీఎంపీలు ఆయా మండల కమిటీల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అన్నారు. మంగళవారం అనపర్తి, బిక్కవోలు మండలాల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొలమూరు శ్రీదేవి ఏసీ ఫంక్షన్ హాల్‌లో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు, సర్వసభ్య సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు వాసంశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ప్రభాకరరావు మాట్లాడుతూ, పీఎంపీ, ఆర్‌ఎంపీల సేవలను ప్రభుత్వం వినియోగించుకోవడానికి ఆరోగ్య శాఖ మంత్రి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పీఎంపీ వారి పేర్లను ఆయా మండల కమిటీ వారికి అందజేయాలని సూచించారు. తొలుత జరిగిన అవగాహన సదస్సులో కాకినాడకు చెందిన మెడికవర్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మాధవరావు ఎముకలకు సంబంధించిన ఇబ్బందులు, అత్యవసర ట్రామా కేసుల్లో పీఎంపీల పాత్రపై వివరించారు. చెవి, ముక్కు, గొంతు సంబంధిత రుగ్మతలను ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ నిఖితా రెడ్డి వివరించారు. వర్షాకాలంలో సైనసైటిస్ ఎక్కువగా ఇబ్బంది పెడుతుందని చెప్పారు. అనంతరం డాక్టర్ మాధవరావు, నిఖితారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, మండల కార్యదర్శి డి.సాయిరామారెడ్డి, కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్, ఎస్ఎస్ చలం, కె.సత్యనారాయణ, పి.బాలసుబ్రహ్మణ్యం, కేఎస్ఎస్ మూర్తి, పీటీఎల్ నారాయణ, బాబ్జీ, పరంశెట్టి శ్రీనివాస్, తిరుపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం అవసరం


పందలపాకలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

బిక్కవోలు: ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి క్షయ వ్యాధిగ్రస్తులకు అదనపు పౌష్టికాహారం అవసరమని కొంకుదురు పీహెచ్‌సీ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం పందలపాక గ్రామంలోని సచివాలయం–1 వద్ద ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్షయ వ్యాధి అంతానికి ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. డయాబెటిక్ బాధితులు, పొగాకు ఉత్పత్తులు వాడేవారు, ఇతర వ్యాధులున్న వారు, 60 ఏళ్లు పైబడిన వారు, పాత క్షయ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులకు కఫం పరీక్షలు, ఎక్సరేలు తీసి వ్యాధి నిర్ధారణ చర్యలు చేపట్టినట్టు వివరించారు. అవకాశం ఉన్నవారు నిశ్చయమిత్రగా చేరి క్షయ వ్యాధిగ్రస్తులకు అదనపు పౌష్టికాహారం అందించేలా సహకరించాలని కోరారు. అనతరం 200 మందిని పరీక్షించి, 50 మంది నుంచి కఫం శాంపిళ్లు సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం, ఆధ్యాత్మికానందం


ధ్యాన శిక్షకులను సత్కరిస్తున్న పోతంశెట్టి తదితరులు

అనపర్తి: నిత్యం ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యం, ఆధ్యాత్మికానందం కలుగుతాయని ధ్యాన ప్రశిక్షకురాలు సవిత అన్నారు. అనపర్తి పాత ఊరులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న ధ్యాన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె ధ్యానంతో కలిగే ప్రయోజనాలు, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సుమారు 50 మంది శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన బృంద సభ్యులను ఆలయ ధర్మకర్త పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి సత్కరించారు.

మూడు గ్రామాల్లో ఎన్‌ఎల్‌ఎం బృంద పరిశీలన


రఘుదేవపురంలో గోశాల షెడ్డును పరిశీలిస్తున్న ఎన్‌ఎల్‌ఎం బృందం

సీతానగరం: మూడు రోజుల పర్యటనలో భాగంగా నేషనల్ లెవల్ మానిటరింగ్ (ఎన్‌ఎల్‌ఎం) బృందం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా మంగళవారం బృంద సభ్యులు ముఖేష్, నాగరాజు సీతానగరం, నల్గొండ, రఘుదేవపురం గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అధ్యయనం చేశారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి, స్వయం సహాయక సంఘాల సమావేశాల నిర్వహణ, అజెండా, రుణాలతో చేపడుతున్న కార్యకలాపాలు, లాభాలపై చర్చించారు. ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న పనులు, హార్టికల్చర్ ప్లాంటేషన్, చెరువుల పూడికతీత, పంత రోడ్లు, గోశాల షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. వీరి వెంట డిప్యూటీ ఎంపీడీఓ కేవీఎస్ఎస్ మూర్తి, ఏపీడీ క్లస్టర్ సీఓ దారా చంద్రశేఖర్, ఏపీఓ సత్యవతి, ఏపీఎం జీలాని, హౌసింగ్ అధికారి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి నాగరత్నం తదితరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత


పరిసరాల పరిశుభ్రతలో పాల్గొన్న విద్యార్థులు

సీతానగరం: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. మంగళవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిసరాల శుభ్రత కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుదామయి ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కళాశాల ఆవరణలో మొక్కలకు నీరు వెళ్లే ఏర్పాట్లు చేసి, కలుపు మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, సుబ్బారావు, అలేఖ్య, మీనాక్షి, వెంకటేష్ పాల్గొన్నారు.

కాపవరంలో గణిత 'పై' దినోత్సవం


పై ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని కాపవరం ఉన్నత పాఠశాలలో మంగళవారం గణిత గుర్తు అయిన 'పై' దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పై విశిష్టతను హెచ్‌ఎం పి.గోపాలకృష్ణారావు విద్యార్థులకు వివరించారు. పై అనేది భిన్నంలోని 22/7కు సమానమని, 22వ తేదీ ఏడో నెల సందర్భంగా అప్రాక్సిమేషన్ డేగా జరుపుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు పై ఆకారంలో ఏర్పడి ఆకట్టుకున్నారు.

నర్సరీల అభివృద్ధితో పర్యాటకానికి ప్రోత్సాహం

రాజమహేంద్రవరం సిటీ: పర్యాటక రంగంలో కడియం ప్రాంతాన్ని ప్రత్యేకంగా నిలిపేందుకు నర్సరీల అభివృద్ధి చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పర్యాటక, హార్టికల్చర్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో పాటు, కడియం నర్సరీ సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడియం నర్సరీలు జిల్లాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. వాటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక విధానంలో సమగ్ర అభివృద్ధి అవసరమన్నారు. బోటింగ్, స్టాల్స్, కాఫీ షాప్, కాటేజీలు, పాటింగ్ మిక్సర్ వ్యర్థాల నిర్వహణ, గ్రీన్ ఆర్గానిక్ వ్యర్థాల ఆధారంగా సేంద్రియ ఎరువుల తయారీ వంటి అనుబంధ కార్యకలాపాలు చేపట్టి ఆర్థికంగా నర్సరీ రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపులో భాగంగా, రాజమహేంద్రవరం ముఖ్య కూడళ్లలో, రహదారి డివైడర్లలో మొక్కల సంరక్షణకు నర్సరీ సంఘం ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. ఇదే సమయంలో గ్రీన్ ఆర్గానిక్ వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి, భూసారాన్ని పెంచే చర్యలు చేపట్టడం వల్ల వాణిజ్యపరంగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆర్థికంగా వారిపై అదనపు భారం ఉండదని వివరించారు. పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దే క్రమంలో తొలి దశలో పొట్టిలంక నుంచి కడియపు లంక వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర 28 స్టాళ్ల ప్రదర్శనతో పాటు, విక్రయాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీల పరిసరాల్లో కాటేజీలు ఏర్పాటు చేసి, పర్యాటకులకు విడిది వసతి కల్పించడం, బోటింగ్‌కు ప్రత్యేక ఆర్చ్ నిర్మాణం తదితర విషయాలపై చర్చించారు. పర్యాటకానికి తోడు నర్సరీ రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా నూతన మార్గాలు తెరుచుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జేసీ ఎస్ చిన్నరాముడు, ఏపీఏఎంబీపీ పీడీ ఎ.దుర్గేష్, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్.మల్లికార్జునరావు, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, కడియం తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, నర్సరీ సంఘ ఉపాధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

పందలపాకలో తహసీల్దార్ విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ మంగళవారం విచారణ చేపట్టారు. పందలపాక గ్రామానికి చెందిన సత్తి గంగాభవాని తన 40 సెంట్లు ప్రభుత్వ భూమిగా చూపుతుందని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వాస్తవాలను తేల్చేందుకు తహసీల్దార్ విచారణ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. వీఆర్వోలు ఒగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నూకరాజు రెవెన్యూ రికార్డులను, రైతు తన పత్రాలను చూపించారు. ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా రఘుకుమార్



కోరుకొండ: కొత్తగా కోరుకొండ మండల వ్యవసాయ శాఖాధికారిగా రఘుకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏజెన్సీ ప్రాంతమైన వీఆర్‌పురం మండలం నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏడీఏ బీకే మల్లికార్జునరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు ఇక్కడ ఏవోగా పనిచేసిన గౌరీదేవి సీతానగరం మండలానికి బదిలీ అయ్యారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాజానగరం: లాలాచెరువు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పోలీసు క్వార్టర్స్ ఫీడర్‌పై మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేవీబీ నటరాజన్ తెలిపారు. రఘునాథపురంలో గృహ, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సంపత్‌నగరంలో..

మండలంలోని సంపత్‌నగరం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌పై మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సంపత్‌నగరం, నామవరం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, జి.యర్రంపాలెంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కోటికేశవరంలో ల్యాబ్ ఆన్ వీల్స్


కోటికేశవరం విద్యార్థులతో పీజీ, యూజీ విద్యార్థులు, అధ్యాపకులు

కోరుకొండ: మండలంలోని కోటికేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం లాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమం జరిగింది. కళాశాలకు చెందిన జంతు శాస్త్ర విభాగం, మైక్రో బయాలజీ విభాగం సంయుక్తంగా నిర్వహించాయి. కాలేజీ పీజీ, యూజీ విద్యార్థులు హైస్కూల్ విద్యార్థులకు మైక్రోస్కోప్ ఉపయోగించి స్లైడ్స్‌ను చూడడంపై వివరించారు. వివిధ రకాల జంతు నమూనాలు, ఫోల్డ్‌స్కోప్‌పై అవగాహన కలిగించారు. జంతు శాస్త్ర విభాగాధిపతులు డి.శైలజ, కె.దుర్గారావు, మైక్రో బయాలజీ విభాగం నుంచి డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సత్కారం


విద్యార్థినులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న అధ్యాపకులు

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండలోని రాజబాబు ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థినులు డి.ధనలక్ష్మి, ఎస్.మహేశ్వరి చెన్నైలోని సత్యభామ విశ్వవిద్యాలయంలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డి.కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో వారిని జ్ఞాపికలతో సత్కరించారు. 2023–25లో ఎంపీసీలో డి.ధనలక్ష్మి 952/1000 మార్కులు, ఎస్.మహేశ్వరి 949/1000 మార్కులు సాధించారు. దీంతో వీరికి యూనివర్సిటీ సీట్లు లభించాయి. ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ, మంచి మార్కులు పొందినందుకు యూనివర్సిటీలో వీరికి మంచి స్థానం లభించిందన్నారు. విద్యార్థులంతా వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇద్దరు విద్యార్థినులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అధ్యాపకులు ఆకాంక్షించారు.